ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

సోమవారం 17 నవంబరు 2025



బస్సుజాతాలో పాల్గొన్న చాడ వెంకటరెడ్డి, కళాకారులు

జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఘనస్వాగతం



ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

జ్యోతినగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాకు ఆదివారం ఎన్‌టీపీసీలో ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో ఎన్టీపీసీకి చేరుకున్న కమిషన్ చైర్మన్‌కు వీఐపీ గెస్ట్ హౌస్‌లో జిల్లా అధికారులు, వివిధ దళిత సంఘాల నాయకులు స్వాగతం పలికారు. సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, లవకుశ కుమార్, కమిషన్ ఉన్నతాధికారులు ఉన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల పూజలు



మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంభ మల్లిఖార్జునస్వామి ఆలయంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయం చుట్టూరా ప్రదక్షిణలు నిర్వహించిన భక్తులు కోడెలతో మొక్కులను సమర్పించారు. ఒగ్గు పూజరులతో పట్నాలు వేయించి మొక్కులను సమర్పించారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి



రన్‌ఫర్ జస్టిస్‌లో మాజీ ఎమ్మెల్యే పుట్టమధు, బీఆర్ఎస్ శ్రేణులు

రామగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్‌లను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే పుట్టమధుకర్ అన్నారు. ఆదివారం రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో రన్‌ఫర్ జస్టిస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాణిరుద్రమాదేవి క్రీడప్రాంగణం నుంచి పన్నూర్ సెంటర్ వరకు రన్ నిర్వహించారు. పన్నూర్ కూడలిలో ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్‌లను బీసీ సమాజం కోరుకుంటుందని, న్యాయబద్ధమైన రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. బీసీ హక్కుల కోసం కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నల్లవెల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్‌లో జేఏసీ జిల్లా అధ్యక్షురాలు ఉష, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు శంకేషి రవీందర్, పూదరిసత్యనారయణగౌడ్, పుల్లేలకిరణ్, దామెర శ్రీనివాస్, నాగెల్లిసాంబయ్య, తగరం శంకర్‌లాల్, ఆసంతిరుపతి, బొంకూరి పోచం, పెద్దసంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉన్ని దుస్తుల అమ్మకాలు



కళ్యాణ్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చలి తీవ్రత పెరగడంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్ని దుస్తుల వ్యాపారం ఊపందుకుంది. మున్సిపల్ టీ జంక్షన్ వద్ద వ్యాపారులు ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నారు. వారం రోజులుగా చలి పెరగడంతో ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. మున్సిపల్ టీ జంక్షన్, గాంధీనగర్ వద్ద ఉన్న ఉన్ని దుస్తుల వ్యాపార కేంద్రాల వద్ద జనం కిటకిటలాడుతున్నారు. గత ఏడాదికంటే ఈ ఏడాది ఉన్ని దుస్తుల ధరలు పెరిగాయి. స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, జంపర్లు, హ్యాండ్‌గ్లౌజ్‌లు, బ్లాంకెట్లు, మఫలర్ల ధరలను పెంచారు. ఒక్కొక్క స్వెటర్ రూ.300 నుంచి రూ.500, జంపర్లు రూ.1200 నుంచి రూ.1500, హ్యాండ్ గ్లౌజ్‌లు రూ.100 నుంచి రూ.200, బ్లాంకెట్లు రూ.300 నుంచి రూ.2000 వరకు ధరలు పలుకుతున్నాయి.

ఆరోగ్య కేంద్రాలకు సుస్తీ..

- మందుల కొరత.. సిబ్బంది లేక ఇబ్బందులు...
- సకాలంలో అందని రక్తపరీక్షల నమూనాలు...
- నలుగురు పని చేసే చోట ఇద్దరు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



గోదావరిఖనిలోని అడ్డగుంటపల్లి అర్బన్ హెల్త్‌సెంటర్

కళ్యాణ్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా లోని ఆరోగ్య కేంద్రాలకు సుస్తి చేసింది. ఆరోగ్య కేంద్రాల్లో దగ్గు, జలుబు ఇతర రోగాల మందులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం పట్టణ, అర్బన్ ఆరోగ్యం కేంద్రాల్లో సిబ్బంది కొరత, మందుల కొరత నెలకొం ది. జిల్లాలో మంథని, సుల్తానాబాద్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7 అర్బన్ హెల్త్ సెంటర్లు, 4 పల్లె దవాఖానాలు ఉన్నాయి. ఇందులో సిబ్బంది కొరతతో సక్రమంగా వైద్య సేవలు అందడం లేదు. కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, ధర్మారం, జూలపల్లి, ఎలిగేడు, బసంత్‌నగర్, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, పెద్దపల్లి, సుల్తానాబాద్‌లలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి.

రామగుండం అర్బన్ పరిధిలో లక్ష్మీపురం, రామగుండం, అల్లూరు, ఫైవింక్లయిన్, అడ్డ గుంటపల్లి, జనగామలో అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. నాలుగు బస్తీ దవాఖానాలు ఖాజిపల్లి, వీకే రామయ్య కాలనీ, చందపల్లి, పెద్దపల్లిలో ఉన్నాయి. ఇందులో అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సిబ్బంది కొరతతో సకాలంలో రాని రక్త పరీక్షల నమూనాలు

జిల్లాలో ఉన్న ఆరోగ్య కేంద్రాల నుంచి వివిధ రోగాలతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చే వారి రక్తనమూనాలు సేకరించి పెద్దపల్లిలోని టీ హబ్‌కు పంపుతున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు సకాలంలో రోగులకు అందక వైద్యం ఆలస్యమవుతుంది. జిల్లాలో ల్యాబ్ టెక్నీషియన్ల కొరత ఉండడం, కొన్ని సెంటర్లలో రక్తనమూనాలు సేకరించడానికి ల్యాబ్ టెక్నీషియన్లు లేక పోవడం,ఉన్న వారిని డిప్యూటేషన్ మీద ఇతర ప్రాంతాలకు పంపుతున్నారు. థైరాయిడ్, బీ12, లివర్ ప్రొఫైల్ ఇతర ముఖ్యమైన డయోగ్నోస్టిక్ పరీక్షలు కూడా ఆలస్యంగా జరుగుతున్నాయి. కొన్ని కొన్ని సందర్భాల్లో గర్భిణీలకు సకాలంలో రక్త పరీక్షల నమూనాలు రాక ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. అంతేకాకుండా ఆసుపత్రిలో నలుగురు పని చేయాల్సిన చోట ఇద్దరే పని చేస్తున్నారు. ప్రతీ ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు స్టాఫ్‌నర్సులు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు ఉండాల్సి ఉండగా ఒక్కొక్క కేంద్రంలో ఒక్క స్టాఫ్

మిగతా 8లో



సూది మందులు కరువు...

ఈ ఆరోగ్య కేంద్రాల్లో కొంత కాలంగా మందుల కొరత ఏర్పడడం, సకాలంలో సరఫరా జరుగక పోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం జ్వరం మందులు తప్ప దగ్గు, జలుబుకు సంబంధించి టానిక్‌లు లేక పోవడం, గాయాలు మానడానికి ఆయింట్‌మెంట్‌లు లేక పోవడం, యాంటీ బయోటిక్ ఇంజెక్షన్లు లేక పోవడంతో రోగులు బయట కొనుగోలు చేసుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వం నుంచి ప్రతీ నెల మందులు సరఫరా కావాల్సి ఉండగా అవి సప్లయి కావడం లేదు. మలేరియా, టైఫాయిడ్, గర్భ నిర్ధారణకు సంబంధించిన కిట్లు కూడా అందుబాటులో లేకుండా పోయాయి. సుల్తానాబాద్‌లో ఉన్న సెంట్రల్ గోడౌన్ నుంచి మందులు సకాలంలో సరఫరా జరుగకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు.

మావోయిస్టులు, వామపక్ష పార్టీలు ఏకం కావాలి

గోదావరిఖని/పెద్దపల్లి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజా, కార్మికుల హక్కులసాధన, మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజా స్వామ్యబద్దంగా పోరాటాలు నిర్వహించేందుకు మావోయిస్టులు, వామపక్ష పార్టీలు ఏకం కావాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపెల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సీపీఐ శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా చేపట్టిన బస్ జాతా ఆదివారం గోదావరిఖనికి చేరుకొంది. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి, చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మావోయిస్టులు, వామపక్ష పార్టీలు విడిగా ఉద్యమాలు చేయడం వల్ల మతోన్మాద పార్టీలు పదవులు అనుభవిస్తూ ప్రజలను, కార్మికులకు నష్టం చేస్తున్నాయన్నారు. ప్రజా, కార్మికుల హక్కుల సాధన కోసం నిజాంపాలనకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం చేపట్టామన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే వంద సంవత్సరాల ముగింపు సభను విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్‌లకు తాకట్టు పెడుతుందని, నిత్యావసర ధరలు, ప్రజా సమస్యలు పట్టించుకో కుండా హిందుత్వం ఏజెండాగా పనిచేస్తుందన్నారు. మావోయిస్టు నాయకులను చంపుతున్నారని, అడవిలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, మారుపాక అనిల్, లక్ష్మీనారాయణ, మడ్డి ఎల్లా గౌడ్, మోహన్, గౌతం గోవర్ధన్, కనకరాజు, మడికొండ ఓదెమ్మ, ప్రీతం, సూర్య పాల్గొన్నారు.

మెగా లెదర్ పార్కు నిర్మాణానికి 10ఎకరాల స్థలం

- గతంలో లీడ్ క్యాప్‌నకు కేటాయించినా నిర్మాణం కాని పరిశ్రమలు...
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎస్సీ కమిషన్ సభ్యుడు
- నేడు లింగాపూర్ శివారులో స్థలాన్ని పరిశీలించనున్న ఎస్సీ కమిషన్ చైర్మన్

కోల్‌సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలం లింగాపూర్ శివారులో మెగా లెదర్ పార్కు నిర్మాణానికి 10ఎకరాల స్థలాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎస్సీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణకు లేఖ పంపారు. 2004లో సర్వే నెం.132లో ప్రభుత్వం లెదర్ పార్కు ఏర్పాటు చేసేందుకు లీడ్ క్యాప్‌నకు 24.29ఎకరాలు కేటాయించింది. 500మంది చర్మకారులకు ప్రభుత్వం శిక్షణనిచ్చింది. కానీ లెదర్ పార్కు ఏర్పాటు చేయలేదు. సుమారు 25ఎకరాల్లో 5ఎకరాల భూమిని 2010లో సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలకు కేటాయించారు. లీడ్ క్యాప్‌నకు కేటాయించిన భూములను తిరిగి ఇప్పించాలని చర్మకారుల సంక్షేమ సంఘం ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది. కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం 25ఎకరాల్లో 10ఎకరాలు అందుబాటులో ఉందని, దానిని స్వాధీనం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నది. సోమవారం రాష్ట్ర ఎస్‌సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణతో పాటు రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్థలాన్ని పరిశీలించనున్నారు.

చదువుకుందాం రండి.. చదువు నేర్పుదాం పదండి

- మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులకు చదువు
- ప్రతి సభ్యురాలిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యం
- పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా వలంటీర్ల ఏర్పాటు
- గ్రామాలకు చేరిన పుస్తకాలు

ముత్తారం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చదువుకుందాం రండి... చదువు నేర్పుదాం పదండి అనే నినాదంతో పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల్లోని ప్రతీ సభ్యురాలు అక్షరాస్యులుగా తీర్చిదిద్దమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వయోజన విద్యాశాఖ నవభారత సాక్షరతా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా గ్రామైఖ్య సంఘాల వీఓల ద్వారా మహిళా సంఘాలలోని నిరక్షరాస్యులను గుర్తించారు. వారికి చదువు నేర్పేందుకు ప్రభుత్వం ద్వారా వలంటీర్లను ఏర్పాటుచేసింది. ఉల్లాస్ ప్రతినిధులు మహిళలు చదవడం, రాయడంపై దృష్టి సారించారు.



జిల్లాలో 62,660 మంది నిరాక్షరాస్యులుగా గుర్తింపు..

పెద్దపల్లి జిల్లాలోని 14 మండలాలుండగా 11020 సంఘాలు ఉన్నాయి. అందులో 1,12,887 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరిలో 62,660 మందిని నిరక్షరాస్యులుగా గర్తించారు. వారికి చదువు చెప్పేందుకు 2833 మంది వాలంటీర్లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 215 పంచాయతీల్లో వీఓఏలు, సీఆర్‌పీలకు అక్టోబర్ 30 నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే ఇప్పటికే చదువు నేర్పేందుకు సంబంధించిన పుస్తకాలు ఆయా గ్రామాలకు చేరాయి.



మహిళా సంఘాల మహిళలు

పేరు... లెక్కలు వచ్చేలా చదువు

పాఠశాల విద్య పొందని 15 ఏళ్ల పైబడిన వారిని అక్షరాస్యులుగా తీర్చదిద్దనున్నారు. చదవడం, రాయడం, అంకెలు గుర్తించడం, కనీస సామర్థ్యాలతో కూడిన లెక్కలు చేయడం నేర్పించనున్నారు. ప్రతి సభ్యురాలు అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అభ్యాసకులు, స్వచ్ఛంద బోధకులు వివరాలు ఉల్లాస్ యాప్ నమోదు చేస్తారు. ప్రతి సభ్యురాలు కనీసం తన పేరు రాసుకునేలా ఉల్లాస్ ప్రతినిధులు చదువు చెప్పనున్నారు.

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దమే లక్ష్యం

శ్రీనివాస్, ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్, పెద్దపల్లి



మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని చేపడుతున్నాం. సెర్ప్ ద్వారా చదవడం, రాయడం, భాషా పరిజ్ఞానం పెంచ డానికి మహిళా సంఘాలతో 62,660 మంది నిరక్షరాస్యులను గుర్తించాం. ఇందులో మొదటి విడతగా 28326 మందికి పుస్తకాలు గ్రామాల వారిగా ఇప్పటికే పంపించాం. వారికి చదువు నేర్పడానికి వీఓఏలు, సీఆర్‌పీలకు శిక్షణ ఇస్తు న్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తాం.

'పది' పరీక్షలకు ప్రత్యేక ప్రణాళిక



- జిల్లాలో 104 జడ్పీ ఉన్నత పాఠశాలలు
- పదివేలకు పైగా విద్యార్థులు
- సాయంత్రం అల్పాహారం కోసం ఏర్పాట్లు

సుల్తానాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. సాధారణ బోధనతోపాటు అదనంగా ఉదయం, సాయంత్రం గంటపాటు తరగతులు ప్రారంభించారు. విద్యార్థులకు అల్పాహారాన్ని సమకూర్చేందుకు అధికారుల సహకారంతో ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు సాయంత్రం వరకు ఉండి చదువుకునేందుకు వారికి అల్పాహారాన్ని అందించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. దాతల సహకారంతో పదో తరగతి విద్యార్థుల ఆకలితీర్చే ఆలోచన చేస్తున్నారు. మార్చిలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి.

జిల్లాలో 104 జడ్పీ ఉన్నత పాఠశాలలు..

జిల్లాలోని 14 మండల కేంద్రాలతోపాటు సుల్తానాబాద్, మంథని, పెద్ద పల్లి పట్టణాల్లో 104 జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటితోపాటు గురుకులాలు, మహాత్మాజ్యోతిరావు పూలే, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా బాలికల విద్యాలయాలు, సోషల్ వెల్ఫేర్ గురుకులాలు ఉన్నాయి. అయితే జిల్లా పరిషత్ హైస్కూళ్లలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మినహా సాయంత్రం అల్పాహారం అందించే ఏర్పాట్లు లేవు. పదో తరగతి వార్షిక పరీక్షలకు మూడు నెలల ముందు నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఈనెల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తు న్నారు. సాధారణంగా ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.15 వరకు పాఠశాలలు నడుస్తున్నాయి. పదో తరగతి విద్యార్థుల కోసం 5.15 వరకు కొనసాగిస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

డిసెంబరు 31 వరకు సిలబస్ పూర్తి చేయాలి

విద్యాశాఖ అధికారులు ఉత్తమ ఫలితాలపై దృష్టి సారిస్తూ ప్రత్యేక తరగతులు నిర్వ హిస్తున్నారు. సాధారణంగా డిసెంబర్ 31 వరకు పది విద్యార్థులకు సిలబస్ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన సిలబస్ పూర్తి చేసి తెలుగు నుంచి సోషల్ వరకు రివిజన్ చేయాలి. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తూ సమాధానాలు రాబడుతారు. సాయంత్రం వారికి అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ ఉంది. ప్రభుత్వం ఈసారి కూడా విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం



మహాసభలో మాట్లాడుతున్న భూపాల్

పెద్దపల్లిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. జిల్లా 4వ మహాసభలు పట్టణంలోని ఎం.బి.గార్డెన్ ఏర్పాటు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి జెండావిష్కరణ చేశారు. మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు తుమ్మల రాజా రెడ్డి అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భూపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలోకి రాకముందు ఒక రకంగా, అధికారంలోకి వచ్చాక మరోరకంగా వ్యవహరిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ యాజమాన్యాలకు, ప్రైవేటు, కార్పోరేట్ వ్యక్తులకు ఊడిగం చేసే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. సింగరేణి, ఎన్టీపీసీ తదితర సంస్థల్ని ప్రైవేట్ పరం చేస్తున్నారని, ఇవన్నీ మోడీ అనుచరులైన ఆదాని, అంబానీలకు కట్టబెడుతున్నారన్నారు. జిల్లా కార్యదర్శి ఎ.ముత్యం రావు, డీ.కొమురయ్య, జ్యోతి, బిక్షపతి, రవీందర్, అరవింద్, రామాచారి, అంజయ్య, వనజా రాణి, గణేష్, స్వారయ్య, నర్సయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చందుర్తి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన పల్లి రవిగౌడ్ అనే గీతకార్మికుడు శనివారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడి గాయపడ్డాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. రవి రోజు మాదిరిగానే తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవ శాత్తు మోకుజారి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు గమనించి రవిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ బస్టాండ్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలవగా మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని ఆముదాలపల్లికి చెందిన కందుల రాజు తిమ్మాపూర్‌లో పెళ్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో తాడికల్ బస్టాండ్ వద్ద అదే గ్రామానికి చెందిన అన్వర్‌పాషా రోడ్డు క్రాస్ చేస్తుండగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాజుకు ఎడమ కాలు విరిగింది. అన్వర్‌పాషాకు కుడి కాలుకు గాయమైంది. గమనించిన స్థానికులు 108వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి శివారులో గుర్తు తెలియని ఓ వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం రాత్రి గ్రామంలో రోడ్డుపై ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తితో పాటు గుర్తు తెలియని కారు గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

పాఠశాలలో కూరగాయల తోటలు


పాఠశాలలో సాగు చేసిన కూరగాయల మొక్కలు

- తల్లిదండ్రుల సహకారంతో నిర్వహణ
- ఫలితాలిస్తున్న విటమిన్ గార్డెన్లు

గంగాధర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోషకాహార కూరగాయల సాగుకోసం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న విటమిన్ గార్డెన్లు సత్ఫలితాలనందిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో ఏర్పాటు చేసిన గార్డెన్లలో నాటిన మొక్కలు నేడు కాతకొచ్చాయి. గంగాధర మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ ఆదేశాలతో విటమిన్ గార్డెన్లు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నాటిన కూరగాయల మొక్కలు కొన్ని పాఠశాలలో కోతులు ధ్వంసం చేస్తుండగా గర్షకుర్తి పాఠశాలలో మాత్రం కూరగాయలు కోతకొస్తున్నాయి.


మొక్కకు నీరు పోస్తున్న విద్యార్థినులు

విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం

ఇక్కడి పాఠశాలలో గార్డెన్ నిర్మించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఉంది. ఉపాధ్యాయులు పాఠశాల వెనకాల ఖాళీ ప్రదేశంలో విటమిన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు మొక్కలకు కావలసిన పోషకాలనందించేందుకు ప్రత్యేకంగా మట్టిని ట్రాక్టర్లతో తెప్పించారు. తెచ్చిన మట్టిని తల్లిదం డ్రులే గార్డెన్‌లో పోశారు. కూరగాయల గార్డెన్‌లో నాటిన మొక్కల సంరక్షణను ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివరిస్తూ వాటికి నీరందిస్తున్నారు. పాఠశాల ముగిసి సమయంలో వాటిని కాపాడేందుకు చుట్టు ట్రీగార్డ్స్‌ను రక్షక కవచంగా ఏర్పాటుకు ఉపాధ్యాయులు సొంత ఖర్చులను వెచ్చించారు. ఇక్కడి గార్డెన్‌లో బచ్చలి కూర, పాలకూర, టమాట, కొత్తిమీర, వంకాయ, సోర, మెంతి, కాలిఫ్లవర్, మునగ వంటి కురగాయల మొక్కలను నాటారు. ఈ మొక్కలను ప్రత్యేకంగా కరీంనగర్ నుంచి తీసుకొచ్చి పెంచుతున్నారు. ప్రస్తుతం బచ్చలికూర, పాలకూర, టమాట, కొత్తిమీర కోతకు వచ్చింది. ఉపాధ్యాయులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం తయారు చేసుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తు మొక్కలను కాపాడుతున్నారు.

విద్యుత్ కార్యాలయంలో ఉద్యోగుల మందు పార్టీ

- ముగ్గురి సస్పెన్షన్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ఉద్యోగులు శనివారం రాత్రి మందుపార్టీ చేసుకున్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో స్పందించిన విద్యుత్ ఉన్నతాధికారులు ఆదివారం ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్‌చేశారు. జగిత్యాలసర్కిల్ కార్యాలయంలో టౌన్-1 సెక్షన్ కార్యాలయ ఓయం స్టాఫ్‌రూంలో శనివారం అసిస్టెంట్ లైన్‌మెన్లు ప్రభాకర్, బాలకృష్ణ, రాజశేఖర్ మందు పార్టీ చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయ్యింది. వారిని సస్పెండ్ చేసినట్లు జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ గంగారాం తెలిపారు. ఈ ఘటనపై సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 17సర్కిళ్లలోని అన్ని సబ్‌స్టేషన్‌లు, విద్యుత్ సంస్థ కార్యాలయాలు విద్యుత్ సంస్థ కార్యాలయాల్లో క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా..

మానకొండూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని స్థానిక పెద్ద చెరువు ప్రాంతంలో ఆదివారం లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడింది. ఐతరాజుపల్లి నుంచి శంకరపట్నం మండలంలోని మొలంగూరుకు సీడ్ వరి ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ వెనకాల నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది. ధాన్యం బస్తాలు రోడ్డు వెంట పడిపోవడంతో స్థానికుల సహాయంతో బస్తాలను రోడ్డు పక్కకు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాముకాటుతో మహిళా రైతు మృతి


రమాదేవి(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన మహిళారైతు సుదాటి రమాదేవి(50) పాముకాటుతో మృత్యువాతపడింది. మృతురాలి కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. ఆదివారం సుదాటి రమాదేవి పొలాన్ని హార్వెస్టర్‌తో కోయిస్తోంది. ఈ క్రమంలో అక్కడక్కడ మిగిలిపోయిన వరికర్రలను కొడవలితో కోస్తుండగా ప్రమాదవశాత్తు పాముకాటు వేసింది. వెంటనే ఆమెను కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందింది. మృతురాలికి భర్త సుదాటి సత్యనారాయణరావుతో పాటు కుమారుడు మాజీఉపసర్పంచ్ సుదాటి కరుణాకర్‌రావు, కూతురు కర్ణ ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే రమాదేవి మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి


లింగం(ఫైల్)

చందుర్తి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం కిష్టంపేట గ్రామంలో విద్యుదాఘాతంతో ఆదివారం ఓ రైతు మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అంబిరీ లింగం(65) అనేరైతు ఇంటి నుంచి మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలం దగ్గరకు వెళ్లిన తండ్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుమారుడు పూర్ణచందర్ పొలం వద్దకు వెళ్లి చూడగా, మోటార్ స్టార్టర్ బాక్స్ వద్ద పడి ఉన్నాడు. వెంటనే స్థానికంగా ఉన్న రైతులను పిలిచి వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య తార గత కొన్ని సంవత్సరాల క్రితం బెజ్జంకి మండలంలో జరిగిన రోడ్డు ప్రమా దంలో మృతి చెందింది. కుమారులు పూర్ణచందర్, రాజు, కూతురు సంపూర్ణ ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఏఎస్ఐ ఆనంద్ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల శివారులోని మానేరు నదిలో దూకి చింతకింది సోమయ్య(55) అనేవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం..సిరిసిల్ల పట్టణం ఆశోక్‌నగర్‌కు చెందిన సోమయ్య పవర్‌లూం కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెల రోజుల క్రితం కంటి ఆపరే షన్ కాగా సరైన ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన సోమయ్య మానేరు నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం సోమయ్య మృతదేహాన్ని మానేరు నదిలో చూసిన జాలర్లు పోలీసులకు సమాచారం అందించారు. అనారోగ్యంతో పాటు ఉపాధిలేక ఆర్థికఇబ్బందులతో మనస్థాపం చెంది సోమయ్య ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య వాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘ టనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంతోషంగా వచ్చి.. విగత జీవిగా మారి


శివాసిని(ఫైల్)

సుల్తానాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న పెద్దమ్మకొడుకు సోదరుడిని తీసుకెళ్లడానికి పెద్దమ్మ, నాన్నమ్మతో కలిసి వచ్చిన బాలిక రోడ్డుప్రమాదంలో మృతిచెందిన ఘటన ఆదివారం సుల్తానాబాద్‌లో చోటుచేసుకుంది. జగిత్యాలజిల్లా బీర్పూర్ మండలం తొంగురు గ్రామానికి చెందిన రాణి, అత్త లక్ష్మితో కలిసి పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్‌లో చదువు కుంటున్న కొడుకు శ్రావణ్ వద్దకు వెళ్లడానికి సమాయత్తమయ్యారు. వారివెంట వస్తానని రాణి మరిది కిషోర్ కూతురు శివాసిని(8) కోరగా ఆమెనుకూడా వెంట తీసుకొని ముగ్గురు సుల్తానాబాద్ చేరుకున్నారు. హాస్టల్‌లో చదువుకుంటున్న రాణి కొడుకు శ్రావణ్‌ను కలిసి మళ్లీ స్వగ్రామానికి వెళ్తామని హాస్టల్ నుంచి సమీపంలోని రాజీవ్‌రహదారి వద్దకు వచ్చారు. పెద్దపల్లి వైపు బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటేయత్నంలో శివాసిని కరీంనగర్ వైపు నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో శివాసిని ఎగిరి రోడ్డుపై పడటంతో అక్కడిక్కడే మృతిచెందింది. మృతురాలి తండ్రి కిషోర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి బాలిక మృతి

పెద్దపల్లి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులపల్లి గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఓ బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మారం మండలం బొట్లవనపర్తికి చెందిన కత్తెర్ల లక్ష్మణ్, భార్య ఇద్దరు కూతుళ్లతో పెద్దపల్లికి వచ్చాడు. అనంతరం ఇంటికి వెళ్తున్న క్రమంలో కాసులపల్లి వద్ద రోడ్డుపై ఉన్న గమనించక బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. పెద్ద కూతురు సాయి పావని (13) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాలిక మృతదేహాన్ని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

సుల్తానాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకల్వల వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాపెల్లి రాజేశం(80) అక్కడిక్కడే మృతి చెందాడు. రాజేశం రోడ్డు పక్కన ఉన్న ఇంట్లోని చెత్తను రోడ్డు ఆనుకుని ఉన్న డంపులో పారబోసి, తిరిగి ఇంట్లోకి వెళుతుండగా కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు అతివేగంతో వస్తున్న టీఎస్22జె6966 కారు ఢీ కొట్టింది. దీంతో రాపెల్లి రాజేశం ఎగిరి కొంతదూరంలో రోడ్డుపై పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు. సమాచారం అందుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తిలోని హోటల్ లివింగ్ ట్రీలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఆదివారం పట్టుకున్నట్లు కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. వారి వద్ద నుంచి 38,060 రూపాయల నగదుతోపాటు ఎనిమిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పాలకులు మారుతున్నా ప్రజల బతుకులు మారలేదు

- ఎజెండాలతో కాకుండా ఎర్రజెండాతో పోరాడుదాం
- సీపీఐ నాయకులు చాడ వెంకటరెడ్డి


ఎడ్ల బండిపై సీపీఐ రాష్ట్ర నాయకుడు చాడ వెంకటరెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో పాలకులు మారుతున్నా ప్రజల బతుకులు మాత్రం మారడం లేదని సీపీఐ సీనియర్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కొమురం భీం జిల్లా నుంచి ప్రారంభమైన కళాజాతా ఆదివారం రాత్రి వేములవాడకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో డిసెంబరు 26, 1925న పుట్టిన పార్టీ సిపిఐ అని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ రంగాలకే వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను కాలరాసి రైతులు, కార్మికులు నిరసన తెలిపే హక్కు లేకుండా చేశారని విమర్శించారు. దేశంలో ఇంకా కూడు, గుడ్డ కోసం నిరుపేద ప్రజలు తల్లాడుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎజెండాలను పక్కన పెట్టి ఎర్రజెండాను పట్టి హక్కులను సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. డిసెంబరు 26న ఖమ్మం జిల్లాలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలో కోరుట్ల బస్టాండ్ నుంచి తిప్పాపూర్ వరకు ఎడ్ల బండి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు కడారి రాములు, మారుపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విషమంగా అశ్రిత్ ఆరోగ్య పరిస్థితి

- అర్చన మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి
- కూల్‌డ్రింక్ బాటిల్ సీజ్
- పోలీసుల అదుపులో మల్లేశం?

కరీంనగర్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడు అనవేని అశ్రిత్ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో శనివారం సాయంత్రం అంగవైకల్యంతో ఉన్న అర్చన(15), అశ్రిత్(17) ఇంట్లో అపస్మారకస్థితిలో ఉండగా తల్లి పోషవ్వ గమనించి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అప్పటికే అర్చన మరణించగా, అశ్రిత్ చికిత్స అందిస్తున్నారు. తల్లి పోషవ్వ మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇద్దరు పిల్లలు స్పృహ కోల్పోయి ఉండడం, ఆమె భర్త మల్లేశం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తండ్రే కూతురు, కొడుకును హత్యచేసేందుకు ప్రయత్నించాడా? అనిపోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నా నిర్ధారించ లేకపోతున్నారు. సంఘటన జరిగిన ఇంటిలో ఒక కూల్‌డ్రింక్ బాటిల్‌తోపాటు మరికొన్ని ఆధారాలను పోలీసులు సేకరించారు. కూల్ డ్రింక్‌లో విషం కలిపి ఇద్దరు పిల్లలచేత తాగించాడా? లేదా గొంతునులిమి హత్య చేశాడా? మరే కారణమనేది వారితండ్రి మల్లేశం పట్టుబడితేగానీ తెలియని పరిస్థితి నెలకొందని, పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తరువాతనే నిర్ధారణ అవుతుందని త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. అర్చన గొంతు వద్ద గాయాలను పోలీసులు గుర్తించారు. అర్చన మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం పూర్తిచేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం రాత్రి మల్లేశంను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

ఆవులను ఎత్తుకెళ్లిన దొంగలు

గన్నేరువరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో శనివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన బండి కనుకయ్య, న్యాలపట్ల ఎల్లయ్య, సుదగోని మహేందర్, పంబాల కొమురయ్యకు చెందిన నాలుగు ఆవులను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు ఆవులను పశువుల పాకలో కట్టేసి ఉంచారు. దొంగలు ఆవులను వాహనంలో ఎక్కించి అపహరించారు. ఒక్కో ఆవు ధర సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు.

నగదు అపహరణ

ఇల్లంతకుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన బూర్ల బాలయ్య ఇంట్లో దొంగలుపడి బీరువాలోని రూ.50 వేల నగదును అపహరించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. బాలయ్య గ్రామపంచాయతీలో పనిచేస్తుండగా అతనిభార్య కూలీపనులకు వెళ్లింది. శనివారం ఇంటికి ఉన్న తాళంతీసిన దొంగలు నగదును ఎత్తుకెళ్ళారు. దొంగలుపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఎస్సై సిరిసిల్ల అశోక్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

విద్యుత్ మోటార్ కేబుల్ చోరీ

ఓదెల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాల్లో శనివారం రాత్రి నలుగురు రైతులకు చెందిన 80 మీటర్ల విద్యుత్ మోటార్లకు ఉండే రాగివైర్ చోరీకి గురయ్యింది. గూడెంలో బుడిగె సతీష్ 30 మీటర్లు, వీరముష్టి శ్రీనివాస్ 25మీటర్లు, బుడిగె కుమారస్వామికి చెందిన 20మీటర్లు, గుంపులకు చెందిన మరో రైతు సల్పాల ప్రశాంత్‌కు చెందిన 25మీటర్లు మొత్తం 80 మీటర్ల రాగి వైర్ గుర్తు తెలియని దుండగలు ఎత్తుకెళ్లారని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం నారుమడులు సిద్ధం చేసుకునే సమయంలో రాగివైర్లను దొంగిలించడంతో రైతులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క మోటార్‌కు ఉన్నవైరు మళ్లీకొనుగోలు చేయాలంటే రూ.3500నుంచి రూ.4వేల వరకు ఖర్చవు తుందని రైతులు పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ

చొప్పదండి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్‌లో కాట్నపల్లి ఫీడర్ పరిధిలోని ఎస్ఎస్-5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ఎతుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని సామగ్రి తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం గమనించిన రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు.


ట్రాన్స్‌ఫార్మర్‌లో సామగ్రిని ఎత్తుకెళ్లిన దొంగలు

ప్రమాదాలకు నిలయంగా మూల మలుపులు

- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృతి


కథలాపూర్ శివారులో ఉన్న ప్రమాదకర మూల మలుపు


పోసానిపేట ఎల్లమ్మ గుడి వద్ద మూల మలుపు

కథలాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని పలు రహదారుల మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. వేములవాడ-కోరుట్ల రహదారిపై కథలాపూర్, పోసానిపేట శివారుల్లో అత్యంత ప్రమాదకరంగా ఉన్న మూల మలుపుల దగ్గర నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఏ వాహనం దూసుక వస్తుందనే విషయం తెలియక అనేకమంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు.

సూచికల ఏర్పాటులో నిర్లక్ష్యం..

ఈ మూలమలుపుల వద్ద లారీలు, బస్సులు, ద్విచక్రవాహనాలు, టిప్పర్లు ఢీకొట్టిన ఘటనల్లో ఇప్పటికే దాదాపు 20మంది ప్రాణాలు వదిలినట్టు స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ రోడ్డు మరియు భవనాల శాఖ అధికారులు ఇప్పటికీ మూల మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వారినిర్లక్ష్యానికి అద్దంపడుతోంది. ఏటేటా ప్రమాదాల సంఖ్య పెరిగిపోతుంటే ప్రమాదాల నివారణపై ఎందుకు శ్రద్ధచూపడం లేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. వేములవాడ-కోరుట్ల రహదారిపై ప్రతీనిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వేములవాడకు శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి ఈ రోడ్డు వెంటే భక్తులు వెళ్తుంటారు. ఈ మధ్య కాలంలో మూలమలుపుల వద్ద మరణిస్తున్న వారి సంఖ్య పెరిగింది. కాగా పోలీసులు సంఘటనలు జరిగిన సందర్భాల్లో తాత్కాలికంగా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తుండడం పరిపాటిగా మారుతోంది.

ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- అజారొద్దీన్, జూనియర్ అసిస్టెంట్, ఆర్‌డీవో కార్యాలయం, మెట్‌పల్లి



ప్రతీదినం ఈ రోడ్డుపై కార్యాలయంకు వెళ్ళి వస్తుంటాను. మూల మలుపుల వద్దకు రాగానే భయపడాల్సి వస్తోంది. ఏ వాహనం రూపంలో వచ్చి మృత్యువు కబళిస్తుందని ఆందోళన తప్పడం లేదు. ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

హైలెవెల్ బ్రిడ్జిగా మార్చాలి..

- ఎంజీ రెడ్డి, మాజీ సర్పంచ్, పోసానిపేట



పోసానిపేట ఎల్లమ్మ గుడి వద్ద ఉన్న మూల మలుపు వద్ద చాలాసార్లు ప్రమాదాలు జరిగి అనేక మంది మరణించారు. అదే ప్రాంతంలో లోలెవెల్ కల్వర్టు ఉండడంతో ప్రమాదాలకు మరింత ఆస్కారం ఏర్పడుతోంది. అక్కడ హైలెవెల్ వంతెన నిర్మించి ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

ఘనంగా కేతేశ్వర-కంకాలమ్మ జాతర

కథలాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం అంబారిపేటలో ఆదివారం శ్రీకేతేశ్వర సహిత కంకాలమ్మ జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక మేదరి సంఘం అధ్వర్యంలో గ్రామ శివారులో ఉన్న స్వామి సన్నిధిలో భక్తులు స్వామివారల దర్శనానికి భక్తులు బారుల తీరారు. చుట్టు పక్కన గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మహిళలు స్వామివారికి బోనాలతో నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మేదరి సంఘం సభ్యులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మహిళలు

పరుగు పోటీలో..

జాతీయ స్థాయికి ఎంపికైన ఆనంది


జాతీయ స్థాయికి ఎంపికైన నల్లవెల్లి ఆనంది

కమాన్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని నల్లవెల్లి ఆనంది అండర్17 విభాగంలోని 800, 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన నల్లవెల్లిశంకర్, భారతిల రెండోవ కుమార్తె ఆనంది గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. గతంలో ఒడిశా రాష్ట్రరాజధాని భువనేశ్వర్‌లోని కలింగస్టేడియంలో నిర్వహించిన 40వ జాతీయచాంపియన్‌షిప్ అండర్16 విభాగంలో మూడోస్థానంలో నిలిచి బ్రౌంజ్‌మెడల్ సాధించింది. వచ్చే నెలలో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆనంది పాల్గొంటారు. ఆమె ఎంపికపై ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు అభినందించారు.

రాజన్న ఆలయ దక్షిణ ప్రాకారం కూల్చివేత


రాజన్న ఆలయంలో ముమ్మరంగా సాగుతున్న విస్తరణ పనులు

వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపనుల్లో భాగంగా 46ఏళ్లచరిత్ర కలిగిన ఆలయం చుట్టూ ఉన్న దక్షిణంవైపు ప్రాకారం కూల్చివేత పూర్తయింది. ఇదే ప్రాంతంలోని కోటిలింగాలను తొలగించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఇందుకు శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖర భారతిస్వామి అనుమతించారు. అంతకు ముందు ఒకసారి పురాతన ప్రాకారం తొలగించి 1979లో పునరుద్ధరించారు. అపుడు దాదాపు ఏడాదిపాటు నిర్మించిన ఈ ప్రాకారాన్ని విస్తరణలో భాగంగా రెండోసారి తొలగించాల్సి వచ్చింది. ఆలయం చుట్టూ ఇరుకుగా లేకుండా ఉండేందుకు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నూతన ప్రాకారం నిర్మించడానికి రూపకల్పన చేశారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి యోగా పోటీలు


యోగాసనాలు వేస్తున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14,-17 యోగాపోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ ఫెయిర్, ఆర్టిస్టిక్ ఫెయిర్ విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ట్రెడిషనల్ అండర్-17 బాలికల విభాగంలో సహస్రలక్ష్మి(కరీంనగర్), ఎ.తనిష్క(వరంగల్), బి.శిరీష(నిజామాబాద్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. అండర్-14 బాలుర విభాగంలో టి.హరీష్ బాలాజీ(కరీంనగర్), పి వినయ్‌కుమార్ (సిద్ధిపేట), మోయిన్ (రంగారెడ్డి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఆర్టిస్టిక్ సింగిల్‌అండర్-17 బాలికలవిభాగంలో బి.సహారతి (నిజామాబాద్), ఎం. స్వాతిక(మెదక్), ఎస్.మహేశ్వరి(ఆదిలాబాద్), బాలుర విభాగంలో ఎస్. రాంచరణ్(మెదక్), ఆర్.శశివర్ధన్(ఆదిలాబాద్), ఎ. విశాల్ (నిజామాబాద్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందారు. ట్రెడిషినల్ అండర్-17 బాలికలవిభాగంలో సీహెచ్ సహస్ర (నిజామాబాద్), టి.కమలిని(కరీంనగర్), బి.సరిసమ(వరంగల్), బాలుర విభాగంలో ఎస్.సమన్విత్(వరంగల్), పి.అఖిల్(కరీంనగర్), శ్రీహరి ప్రసాద్(హైదరాబాద్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరితోపాటు రిథమిక్ ఫెయిర్, ఆర్టిస్ట్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ నిర్వహణకార్యదర్శి బసబోయిన వేణుగోపాల్, రాష్ట్ర పరిశీలకులు టి సతీష్, ఎన్. శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్స్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరి, నిర్వాహకులు వీర్ల హనుమంతరావు, వెలిచాల యూత్‌సభ్యులు,పీడీలు,పీఈటీలు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు భరోసా




- 11 నెలల్లో 39 మందికి ఆర్థిక సహాయం
- 63 కేసుల్లో న్యాయసహాయం, 43మందికి వైద్యసేవలు
- 11మందికి రూ.3.5లక్షల నష్టపరిహారం అందజేత

కరీంనగర్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలకు కరీంనగర్ శివారులో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం అండగా నిలుస్తున్నది. కమిషనరేట్ పరిధిలో మహిళలపై జరుగుతున్న వివిధరకాల నేరాల్లో బాధితులకు న్యాయ సహాయం అందిస్తోంది. సైబర్‌నేరాలపై మహిళలకు అవగాహన కల్పిస్తోంది. మహిళా బాధితుల్లో ఆత్మ విశ్వాసం నింపడం, లైంగిక, ఇతర రకమైన వేధింపులు, నేర ఘటనల్లో ఎలా?ఎవరికి? ఫిర్యాదు చేయాలి, ఎవరిని సంప్రదించాలి? అనే విషయాల్లో బాధితులకు భరోసా కేంద్రం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

అన్ని రకాల సమాచారం

భరోసా కేంద్రం పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం పర్యవేక్షణలో నడుస్తున్నది. భరోసా కేంద్రంలో ఒక నిర్వహణాధికారి, ఇద్దరు కౌన్సెలర్లు, రిసెప్షనిస్టు, ఒక ఏఎస్ఎం, లీగల్ అడ్వైజర్ ఉంటారు. వీరంతా బాధితులకు కావాల్సిన అన్నిరకాల సమాచారంతో పాటు సహాయాన్ని అందిస్తారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో 2022 సంవత్సరంలో మహిళా బాధితులకు సంబంధించి 498 కేసులు నమోదుకాగా 2023 సంవత్సరంలో 565 కేసులు నమోదయ్యాయి.

- 2024 డిసెంబరు 22న కరీంనగర్ శివారులోని కొత్తపల్లి వైద్యకళాశాల పక్కన ఈ భరోసా కేంద్రాన్ని అప్పటి డీజీపీ జితేందర్ ప్రారంభించారు. కోటి 70 లక్షల రూపాయలతో వెయ్యి చదరపు గజాల స్థలంలో 6,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యంత ఆధునిక వసతులతో నిర్మించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో భరోసా కేంద్రం, మొదటి అంతస్తులో షీటీమ్స్ రెండో అంతస్తులో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వింగ్ (మానవ అక్రమ రవాణా) విభాగాలు ఉంటాయి. గృహహింస, పోక్సో, సైబర్ వేధింపుల్లో మహిళా బాధితులకు సరైన న్యాయసహాయం అందించాలనే ధ్యేయంతో ఈ భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- 2024 డిసెంబరు నుంచి ఇప్పటివరకు 45 పోక్సో కేసులు, 25 లైంగిక వేధింపులు, మూడు ఇతర కేసుల్లోని బాధితులకు భరోసా సిబ్బంది న్యాయ సహాయం చేశారు. 59 కేసుల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 180ప్రకారం, 54 కేసుల్లో బాధితుల నుంచి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 183ప్రకారం స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. 43 మందికి వైద్య సహాయం అందించారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నష్టపరిహారం కోసం 39మంది బాధితుల తరపున దరఖాస్తులు సమర్పించగా, ఇప్పటివరకు 11 మంది బాధితులకు మూడు లక్షల యాభై వేల రూపాయలు అందజేశారు.

చదరంగంతో ఆలోచనా శక్తి పెంపు

- జిల్లా విద్యాధికారి రాము
- ఘనంగా అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ ప్రారంభం


చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో రాము, డీవైఎస్‌వో రవి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో ఆలోచనా శక్తి పెంపొందుతుందని జిల్లా విద్యాధికారి రాము, జిల్లా యువజన క్రీడల అధికారి రవికుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం స్థానిక అకడమిక్ హైట్స్ పాఠశాలలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్ 17 బాల బాలికల చెస్ సెలక్షన్ టోర్నమెంట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలకు జిల్లా విద్యాధికారి రాము, జిల్లా యువజన క్రీడల అధికారి రవికుమార్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ చెస్ ద్వారా విద్యార్థులకు ఆలోచనాత్మక శక్తితో పాటు, మానసిక ఉత్తేజం సిద్దిస్తుందన్నారు. జగిత్యాల జిల్లాను క్రీడల పరంగా ముందు వరుసలో ఉంచేందుకు ఎల్లవేళలా తమవంతు తోడ్పాటును అందిస్తామని తెలిపారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చక్రధర్‌రావు మాట్లాడుతూ మొదటిసారిగా జగిత్యాల జిల్లాలో చెస్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ టోర్నమెంట్‌కు ఉమ్మడి 10 జిల్లాల నుంచి 100మందికి పైగా క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. ఈ పోటీల్లో ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలు ఎంపికవగా, త్వరలో జాతీయ స్థాయిలో జరగబోయే చెస్ టోర్నీకి ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీఈటీలు విశ్వప్రసాద్, రాజమల్లయ్య, శ్రీనివాస్, రిఫరీ మట్టయ్య, ఛీఫ్ ఆర్బిటార్ అనిల్, జిల్లాకు చెందిన పలువురు పీఈటీలు, పాఠశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తజన సందడి

- వేములవాడ, ధర్మపురిలో భక్తుల రద్దీ
- ధర్మపురిలో వైభవంగా గోదావరి హారతి


వేములవాడలో భీమన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో భక్తజనసందడి నెలకొంది. కార్తీకమాసం సందర్భంగా ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భీమేశ్వరాలయంలో భక్తులు కోడెల మొక్కులు చెల్లించి అన్నపూజ, అభిషేకం పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యాన్నదాన సత్రంపై నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతాలు చేయించుకున్నారు.

● బద్దిపోచమ్మకు బోనాలు..

రాజన్న సన్నిధిలో స్వామివారి దర్శించుకున్న భక్తులు శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆదివారం శ్రీబద్దిపోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించేందుకు బారులు తీరారు. ఆలయంలో వేలాదిమంది భక్తులతో రద్దీ ఏర్పడింది. భీమేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవంలో భాగంగా సుహాసినులు దీపాలు వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు.

● నరసింహుడి క్షేత్రంలో..

ధర్మపురి : కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. దీంతో క్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం తోడుగా సెలవు దినం కావడం వల్ల ఉదయం వరకు సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద పారాయణ దారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు అభిషేకం, నిత్య పూజలు జరిపారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.


ధర్మపురిలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


గోదావరి నది వద్ద హారతి పూజలు

● ఘనంగా గోదావరి హారతి

ధర్మపురి వద్ద ఆదివారం గోదావరి హారతి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోక క్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్ర స్థాయి

స్విమ్మింగ్ పోటీలు

రామగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలను రామగిరి మండలంలో నిర్వహించనున్నారు. 69వ ఎస్‌జీఎఫ్ అండ్14 బాల, బాలికల రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు ఈ నెల 17 నుండి 19 వరకు స్థానిక రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కనుకుంట్ల లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో తెలంగాణ ఉమ్మడి పది జిల్లా నుంచి సుమారు 520 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను తెలం గాణ జట్టుకు ఎంపిక చేసి వచ్చే నెలలో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఈ నెల 18న ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లో


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

జగిత్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు స్వల్పంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోవస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501టీఎంసీల నీరునిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్‌భగీరథ, వరదకాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా 8వేలక్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కులు విడుదల అవుతోంది.

సమస్యల వలయంలో నాయకపుగూడెం

- కనీస వసతులు లేక గిరిజనుల ఇక్కట్లు
- నిర్మాణానికి నోచుకోని మురికి కాలువలు, సీసీ రోడ్లు
- తాగు నీటికి తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బీర్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోకి వచ్చే నాయకపుగూడెంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గూడెంలో సీసీ రోడ్డు, మురికి కాలువలు లేవు. గూడెంలో 60 కుటుంబాలు, 180 మంది జనాభా, 110మంది ఓటర్లు ఉన్నారు. నాయకపుగూడెం కండ్లపల్లి గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ప్రజలకు తాగునీరు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

● అలంకారప్రాయంగా వాటర్‌ట్యాంక్

గూడెంలో రెండు చేతిపంపులు ఉంటే ప్రస్తుతానికి ఒక్క చేతిపంపు మాత్రమే పనిచేస్తోంది. దీంతో ఆ నీరు అన్ని కుటుంబాలకు సరిపోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో మిషన్ భగీరథ పైపు లైన్లు వేసి ఇంటికో నల్లా కూడా ఏర్పాటుచేశారు. సమీపంలో ఒక వాటర్ ట్యాంక్ కూడా నిర్మించినా నీటికి కనెక్షన్ ఇవ్వలేదు. ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న తమ ఇళ్లకు పట్టాలు లేవని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాయకపుగూడెం అటవీ భూమి అని అందులో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇండ్లు కట్టడానికి అనుమతులు లేవని అటవీశాఖ అధికారులు అడ్డు పడుతున్నట్లు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లా

గిరిజన గూడెం అటవీ భూముల్లో ఉన్నప్పుడు పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలను ఎందుకు కట్టారని, ప్రజలకు నీటి సౌకర్యం అందించడం కోసం వాటర్ ట్యాంక్ ఎందుకు నిర్మించారని పలువురు గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్మాణాలు చేపట్టినప్పుడు గుర్తుకు రాని అటవీ భూములు గిరిజనులు ఇళ్లు కట్టుకుంటేనే గుర్తుకు వస్తాయా అని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● ఇళ్లకు పట్టాలు ఇప్పించాలి..

- గోపిరాజన్న, నాయకపుగూడెం



అటవీ భూమి అంటూ అధికారులు ఇళ్లు కట్టుకోకుండా అడ్డు పడుతున్నారు. మేము ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నాం. ప్రభుత్వం, అధికారులు మమ్ములను గుర్తించి మా ఇండ్లకు పట్టాలు ఇచ్చి గూడెంలో అభివృద్ధి పనులు చేయాలి.

● మా బాధలు పట్టించుకోవాలి..

- పెరుమండ్ల మల్లవ్వ, నాయకపుగూడెం



60 కుటుంబాలకు రెండే బోరింగ్‌లు ఉన్నాయి. అందులో ఒక్కటి పని చేయడంలేదు. బడి దగ్గర ఒక్కటే పని చేస్తుంది. వాటర్ ట్యాంక్ కట్టి ఇంటికో నల్లా పెట్టినా ఒక్క రోజు కూడా నీళ్ల రాలేదు. నాయకులు, అధికారులు మా గూడెంలో బాధలను పట్టించుకోవాలి.

జర్మనీలో ప్రపంచ వ్యవసాయ సదస్సు

- పాల్గొన్న సిరిసిల్ల జిల్లా రైతులు

కోనరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అగ్రికల్చర్‌లో భాగంగా జర్మనీలో జరుగుతున్న ప్రపంచ వ్యవసాయ సదస్సుకు రాజన్న సిరిసిల్లజిల్లా రైతులు హాజరయ్యారు. కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామానికి చెందిన ధూమ్‌పేట నాగరాజు, మామిడిపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రైతులు ప్రపంచ వ్యవసాయసదస్సులో పాల్గొన్నారు. సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన రైతులను జర్మనీఇండియా ఎంబసీ అధికారులు అభినందించారు. ఆధునిక సాంకేతిక వ్యవసాయం, డేటా ఆధారిత వ్యవసాయ విధానాలు, ఏ-1సెన్సార్ టెక్నాలజీ వంటి అంశాలను నేర్చుకునేందుకు, వాటిని తెలంగాణలో అమలు చేయాలని రైతులు జర్మనీ రావడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ రైతులు చూపుతున్న ఆసక్తి భవిష్యత్ వ్యవసాయానికి దారితీసి కొత్త అవకాశాలను సృష్టిస్తుందని మెచ్చుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అగ్రిటెక్ మార్పుల్లో భారత రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ఎంబసీ అభినందించింది. వేములవాడ మాజీఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రపంచ వ్యవసాయ సదస్సులో పాల్గొన్న రైతులను అభినందించి తన ఇంటికి ఆహ్వానించి వసతి సౌకర్యం ఏర్పాటు చేశారని మండల రైతులు తెలిపారు.


జర్మనీలో వేములవాడ మాజీఎమ్మెల్యే రమేష్ బాబుతో కోనరావుపేట రైతులు

'టాస్క్' శిక్షణతో ఉద్యోగాలు


ఉద్యోగాలు సాధించిన మినిషా, సింధూజ, పి.సాయి, సాయి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) రీజినల్ సెంటర్ ద్వారా శిక్షణ పొందిన యువత ఉద్యోగాలు సాధించింది. ఇటీవల టాస్క్ శిక్షణలో పొంది ఇంటర్వ్యూలకు హాజరైన తొమ్మిది మంది విద్యార్థులు, టెలిఫెర్మార్మెన్స్ సంస్థలో కాంటెంట్ మోడరేటర్‌గా ఎంపికయ్యారు. జిల్లా యువత ఉద్యోగాలు పొందడం ఆనందంగా ఉందని సెంటర్ ప్రతినిధులు పేర్కొన్నారు. గోదావరిఖనికి చెందిన మినిషా ఒడ్నాల ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేసింది. టాస్క్ అందించిన శిక్షణతో ఇంటర్వ్యూలో మెరుగైన ప్రతిభ కనబరిచి హైదరాబాద్‌లో ఉద్యోగం సాధించింది. అలాగే పెద్దపల్లి మండలం హనుమంతునిపేటకు చెందిన సిందూజ బీటెక్ సీఎస్సీ పూర్తి చేసింది. టెక్నికల్ శిక్షణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలలో టాస్క్ మార్గదర్శకంలో ఉద్యోగం సాధించింది. పెద్దపల్లికి చెందిన పెస్క సాయిసింధు బీటెక్ సీఎస్సీ చదివింది. పరిశ్రమ అవసరాలకు తగ్గ శిక్షణతో కంపెనీ ఇంటర్వ్యూలో విజయాన్ని సాధించింది. మంథని మండలం ఎక్లాస్‌పూర్‌కు చెందిన వేల్పుల సాయిరాణి బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చేసింది. టెలిఫెర్ఫార్మెన్స్ కంటెంట్ మోడరేటర్ ఉద్యోగం పొందింది.

పాత్రికేయుల సేవలు మరువలేనివి

ఎలిగేడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పాత్రికేయుల సేవలు మరువలేమని మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్‌రావు అన్నారు. ఎలిగేడులో ఆదివారం జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు పాత్రికేయులను మాజీ ప్రతినిధులు సన్మానించారు. సమస్యల పరిష్కారంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే సాధనాలు పత్రికలేనని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాత్రికేయులు ప్రజా సమస్యల పరిష్కారంలో తమవంతు పాత్ర పోషిస్తూ సమాజహితం కోసం పాటుపడుతున్నారని కొనియాడారు. మాజీ సర్పంచ్‌లు కొండ తిరుపతి గౌడ్, పెద్ది సమ్మయ్య, తానిపర్తి వెంకటేశ్వర్‌రావు, నాయకులు కప్పల ప్రవీణ్, కాంపల్లి బాపయ్య, గట్టు రాజయ్య, ముద్రవేణి మహేందర్, ఓరుగంటి కనుకయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): జాతీయ పత్రికా దినోత్సవం పురస్కరించుకుని పెద్దబొంకూర్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సామాజిక సేవా కార్యకర్త మిట్టపల్లి శ్రీనివాస్ పాత్రికేయులను సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలవేన రవి, ఎలబోతారం మహేష్, ఎనగందుల శ్రీనివాస్, మిట్టపల్లి సదానందం, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో నవచండీ యాగం


హోమం నిర్వహిస్తున్న పూజారులు

జ్యోతినగర్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పీటీఎస్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక మాసం చివరి ఆదివారం పురస్కరించుకుని నవచండీ యాగం నిర్వహించారు. ఇందులో 49 మంది దంపతులు పాల్గొనగా, కరీంనగర్ నివాసి శ్రీహరి శర్మ నేతృత్వంలో కన్నుల పండువగా యజ్ఞం సాగింది. ఉదయం గణపతి పూజ, నవగ్రహ హోమం, మన్యుసూక్త హోమం అనంతరం చండీ హోమం నిర్వహించగా, పూర్ణాహుతితో సమాపనం చేశారు. ఆలయ పూజారి రుద్రభట్ల శ్రీకాంత్, వేదపండితులు శ్రీహరిలు పాల్గొన్నారు. ప్రధాన హోమకుండంతోపాటు 12 కుండాలు ఏర్పాటు చేసి హోమ యజ్ఞం నిర్వహించారు.

పద్మశాలి ఉద్యోగుల సంఘం కార్యవర్గం


కొలిపాక సారయ్య

రామగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొలిపాక సారయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఐఎన్‌టీయుసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా పరికి పండ్ల కొటేషం, కోశాధికారిగా కొలిపాక నగేష్, సహ అధ్యక్షులుగా ఆంజనేయులు, తాటికొండ శంకర్, వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా పెండెం సత్యనారయణ, సహాయకార్యదర్శిగా వేముల సతీష్‌కుమార్, అనుమాండ్ల రాజశేఖర్, కార్య నిర్వాహక సెక్రటరిగా కుడిక్యాల హరీష్, కార్యాలయ కార్యదర్శి చింత కింద రమేశ్ ఎన్నికైయ్యారు. ఎన్నికల అధికారిగా చిలుక శ్రీనివాస్ వ్యవహరించగా ఓదెలు, దొమల లక్ష్మీపతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

మంథని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎల్‌బీ గార్డెన్స్‌లో 1996లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. చాలా సంవత్సరాల తర్వాత ఒక చోట చేరిన పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు అష్టావధాని గంగాధర్, అల్లం వీరయ్య, పవిత్రం భూమయ్య, చందుపట్ల సుధాకర్‌రెడ్డి, సుశీల, శంకర్, గట్టు సావిత్ర, అనిలా, సునీలా శాలువాలతో సన్మానించారు. ఆర్గనైజర్లు కొంతం వెంకన్న, పవిత్రం శ్రీనివాస్, ఎర్రబాటి, మనోజ్ కాచే, గంధం అంజిబాబు, పోతరాజు శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం

కోల్‌సిటీటౌన్, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): నిరుపేద మహిళ దహన సంస్కారాలకు నీడ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం సహాయం అందించారు. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన కొండ్ర లక్ష్మీ అనారోగ్యంతో మరణించగా దహన సంస్కారాలకు నీడ గ్రూప్ నుంచి సేకరించిన రూ. 6వేలు లక్ష్మి కుటుంబ సభ్యులకు అందించారు. మాజీ కార్పొరేటర్ బొమ్మక రాజేష్, చుక్కల శ్రీనివాస్, సామాజిక సేవకులు పూర్మ శ్రీనివాస్, నాయకులు దేవ వెంకన్న పాల్గొన్నారు.

బీరులో చెత్త

ముత్తారం, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలంలోని ఓ మద్యం షాపులో ఆదివారం మద్యం ప్రియుడు బీరు కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో బీరులో పాకురు ఉండటాన్ని గమనించి అవాక్కయ్యాడు. అయితే బీరు సీసాను ఓపెన్ చేయకముందే దాన్ని గమనించి వైన్స్ నిర్వాహకులకు చూపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాహకులు మరో బీరు ఇచ్చారు.

రంగనాయక స్వామి ఆలయంలో కార్తీక వన సమారాధన


రంగనాయక స్వామి ఆలయ ఆవరణలో పారాయణం చేస్తున్న మహిళలు

సుల్తానాబాద్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అఖిల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా రంగనాయక స్వామి ఆలయ ఆవరణలో కార్తీక వన సమారాధన భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్తీక మాస పవిత్రతను చాటుతూ బ్రాహ్మణ కుటుంబాలు ఆలపించిన కీర్తనలు, మంత్రోచ్చారణలతో మారుమోగించారు. మహిళలు సంప్రదాయంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేశారు. రంగనాథ స్వామి ఆలయంలో విష్ణు, శివారాదన ఘనంగా జరిగింది. అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, లలిత సహస్రనామాల ఘోషతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఉమ్మడి జిల్లాకు చెంది సుమారు 300 మంది పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులందరికి అన్నదాన కార్యక్రమం చేశారు. అఖిల బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కసుబా భూమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పురం ప్రేమ్‌చందర్‌రావు, ఉపాధ్యక్షుడు జివి రంగారావు, శ్రీగణేశ శారద శంకరాలయ కమిటీ అధ్యక్షుడు ఉపేందర్ శర్మ, ప్రధాన కార్యదర్శి రామక విట్టల్ శర్మ, నాగన్న, నేదునూరి వామన్‌రావు, మూగు హరిశంకర్ శర్మ, దామోదర్ రావు, రాం మోహన్, రాధకిషన్‌రావు, పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణ మహోత్సవం


వేంనూర్‌లో కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

పాలకుర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని వేంనూర్‌లో ఆదివారం వేంకటేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. సమీప గ్రామాలకు చెందిన పలువురు భక్తులు కల్యాణం తిలకించేందుకు పెద్దఎత్తున తరలి వచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తెలెత్తకుండా ఆలయ కమిటి సభ్యులు సదుపాయాలు కల్పించారు.

కార్తీక మాస వన భోజనాల్లో పాల్గొనండి

కళ్యాణ్‌నగర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రామగుండం పంచముఖ హనుమాన్ అంజనాద్రి గుట్టపైన ఈ నెల 19న జరిగే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, కార్తీకమాసం వన భోజనాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఒజ్జల వెంకటేశ్వర్లు కోరారు. కొండపైన నిర్మిస్తున్న ధనుర్బాణ రామాంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహిస్తున్నట్టు, వ్రతంలో కూర్చునే దంపతులు ఈ నెల 18వ తేది సాయంత్రం లోపు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆరోగ్య కేంద్రాలకు సుస్తీ

(5వ పేజీ తరువాయి)

నర్సు మాత్రమే ఉంటున్నారు. దీంతో వైద్య సేవలు అందడం లేదు. సిబ్బంది కొరత తీర్చాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నప్పటికీ పోస్టులను మాత్రం భర్తీ చేయడం లేదు.

స్టేషనరీ కొరత...

ఆసుపత్రికి వచ్చే రోగులకు మందులు, ల్యాబ్ రిపోర్టు ఇవ్వడానికి కూడా స్టేషనరీ కొరత ఏర్పడుతుంది. మందులు రాయడానికి, రక్త పరీక్షల నమూనాలకు, ఇతర అవసరాల కోసం స్టేషనరీని కూడా ప్రభుత్వం అందించలేని దుస్థితిలో ఉంది.

వేతనాలు లేక ఇబ్బందులు...

పట్టణ ఆరోగ్య కేంద్రాలతో పాటు బస్తీ దవాఖానాల్లో పని చేసే కాంట్రాక్టు సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తమకు వేతనాలు చెల్లించాలంటూ పలు మార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వైద్య సిబ్బంది ఆరోపిస్తున్నారు.

అధికారుల సంఘం ఆరోపణలను ఖండిస్తున్నాం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

గోదావరిఖని, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అధికారుల సంఘం హెచ్ఎంఎస్‌పై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం తిలక్‌నగర్‌లోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో అండర్ గ్రౌండ్‌లో పని చేస్తున్న యువ కార్మికులకు ప్రమాదాలకు గురవుతున్నారని, దీనికి అధికారుల సంఘం సమాధానం చెప్పాల న్నారు. 2024 జూలై 27న జీడీకే 2ఇంక్లైన్‌లో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయాలపాల య్యారని, అందులో ఇద్దరు కార్మికులు తుడి సంపత్, నోయల్ రాజ్ పరిస్థితి ఇప్పటికీ దారుణంగా ఉంది, అయినా వారిని అండర్ గ్రౌండ్ పిట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కార్మికుల రక్షణ గురించి మాట్లాడిన వారికి సస్పెన్షన్లు, చార్జిషీట్లు ఇస్తున్నారని, ఇదెక్కడి న్యాయమన్నారు. ఆర్‌జీ-1లో అధికారుల నిర్లక్ష్యంతో జరిగిన ప్రమాదాలు చాలా ఉన్నాయని, వాటి మీద ఇప్పటి ఏ చర్యలు తీసుకోలేదన్నారు. డిప్యూటి జనరల్ సెక్రటరీ వెంకట్, వైస్ ప్రెసిడెంట్ గాలి కిరణ్ కుమార్, నాయకులు పల్లె క్రాంతి కుమార్, దబ్బెట సతీష్, రాజేష్, రామచందర్, చందర్ రావు, సంపత్, కుమార స్వామి, మల్లేశ్, నజీర్, రఫీ, శ్రీకాంత్, గోపాల్, రామస్వామి, రాయనర్సు, సంతోష్, స్వామి, శ్రీనివాస్, బక్కయ్య పాల్గొన్నారు.

ముగిసిన బాలోత్సవ్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఫైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా స్పందన మోడల్ స్కూల్‌లో జరుగుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా పాఠశాలల బాలోత్సవ్ ఆదివారం ముగిసింది. ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్, మట్టితో బొమ్మల తయారీ, కథా రచన, కవితా రచన, ఫోక్ డ్యాన్స్ గ్రూప్ అంశాల్లో పోటీలు జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో 20 పాఠశాలలకు చెందిన 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నది.

సైబర్ మోసాలపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ముత్తారం, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): అవగాహన రాహిత్యం, అజాగ్రత్తగా ఉంటే సైబర్ మోసానికి గురవుతారని ఎస్ఐ ఎన్.రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కాసర్లగడ్డ వద్ద ఆదివారం సైబర్ నేరాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు ఫోన్ చేసి ఓటిపిలు అడిగితే చెప్పవద్దని అన్నారు. వాట్సప్‌లో వచ్చే అనుమానిత లింక్‌లపై క్లిక్ చేయడం, యాప్‌లను డౌన్ లోడ్ చేయడం వల్ల సైబర్ మోసానికి గురవుతారని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ దేవేందర్ రెడ్డి కానిస్టేబుల్ అశోక్, సుమంత్ రెడ్డి,ప్రత్యూష పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపు



ముత్తారం, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండల కేంద్రం నుంచి ఖమ్మంపల్లి గ్రామానికి నిర్మించిన రోడ్డు మార్గం మధ్యలో ఓ చోట మూలమలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మలుపు వద్ద ఎలాంటి రక్షణ గోడ నిర్మాణం చేపట్టలేదు. అక్కడ మలుపు ఉందనే ఎలాంటి సూచికలు కూడా ఏర్పాటు చేయలేదు. ఏదైనా వాహనం అటుగా వెళ్లే క్రమంలో ఆదమరిస్తే పొలాల్లోకి దూసుకెళ్లి పరిస్థితి నెలకొంది. అంతేగాకుండా అక్కడ చిన్న చిన్న కంకర, మట్టి ఉన్న కారణంగా వాహనం అదుపు తప్పే పరిస్థితి ఎదురవుతుంది. వెంటనే అధికారులు స్పందించి రక్షణ గోడ ఏర్పాటు చేయడంతోపాటు రోడ్డుపై కంకర, మట్టిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

కమ్మ కులస్తుల వనభోజన మహోత్సవం

కమాన్‌పూర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సానా గార్డెన్స్‌లో ఆదివారం కమ్మ కులస్తుల వనభోజన మహోత్సవ వేడుకలను నిర్వహించారు. జిల్లా కమ్మ వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు ఆటపాటలతో, పరిచయాలతో సందడిగా మారింది. ఇందులో పెద్దపల్లి, మంథని, గోదావరిఖని తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 300 కుటుంబాలకు పైగా పాల్గొన్నారు. కమిటీ ముఖ్యులైన శ్రీనివాసరావు, మన్నె రవి, కంటపూడి రామకృష్ణ, సూర్యదేవర వెంకటేశ్వరరావు, జ్యోతి, శివరామకృష్ణ, యార్లగడ్డ రాంబాబు, భానుప్రసాద్, బాబ్జి తదితరులు పాల్గొని, సమన్వయంతో విజయవంతం చేసినట్లు తెలిపారు. అనంతరం సానా రామకృష్ణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు.

రాజీవ్ యువ వికాసం అమలుచేయాలి

ముత్తారం, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని మాజీ వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి పథకం ద్వారా రూ.50 వేల నుండి రూ.4 లక్షల వరకు రుణాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు అర్హులు 16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు పట్టించుకోకోవడం సరైంది కాదన్నారు. లబ్ధిదారులకు నిధులు మంజూరు చేసి వారి అకౌంట్లలో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు

టీబీజీకేఎస్ ఆర్థిక సహాయం

గోదావరిఖని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన దస్తగిరి కుటుంబానికి టీబీజీకేఎస్ ఆర్థిక సహాయం అందజేసింది. ఆదివారం గోదావరిఖని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో దస్తగిరి కుమారుడు సమీర్‌కు టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి రూ.10వేలను ఆర్థిక సహాయం అందజేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, కోశాధికారి చెల్పూరి సతీష్, వాసార్ల జోసెఫ్ పాల్గొన్నారు.

మెడికవర్ ఉచిత వైద్యశిబిరం

సుల్తానాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 250 మందికి మెడికవర్ ఆసుపత్రి కార్డియాలజిస్టు డాక్టర్ అనీష్ పబ్బ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో చేశారు. మెడికవర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మాజీ సర్పంచ్ ఆయిల్ల రమేష్, రాజేంద్ర ప్రసాద్, పర్శరాములు, రాజేందర్, భాస్కర్, రమణ, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, హరీష్ పాల్గొన్నారు.

నియామకం

ఎలిగేడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ర్యాకల్‌దేవుపల్లికి చెందిన మద్దెల సంపత్‌ను జైతెలంగాణ మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు దళితరత్న నల్లా కనకరాజు పేర్కొన్నారు. సంపత్ మాట్లాడుతూ మాలమహానాడు కమిటీలను వేసేందుకు బాధ్యతలు అప్పగించారని తెలిపారు.

ఘంటసాల విగ్రహం పునఃనిర్మాణం

రెండు నెలల్లో విగ్రహాన్ని తీర్చిదిద్దిన మెండె రమేష్



మంథని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణంలో గానగంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వర్‌రావు విగ్రహాన్ని పునఃనిర్మించారు. ఆయనపై ఉన్న అభిమానంతో రెండు నెలల పాటు శ్రమించి ప్రధాన చౌరస్తాలో ఆయన విగ్రహాన్ని గంగాపురి గ్రామానికి చెందిన శిల్పి, గాయకుడు మెండె రమేష్ తీర్చిదిద్దారు. 2016 డిసెంబరు 4న ఘంటసాల జయంతి సందర్భంగా శ్రీశారద గాన కళా సమితి ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాలోని రోడ్డు డివైడర్ మధ్య ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో కూడా మెండె రమేష్ విగ్రహాన్ని తయారు చేసి స్థానిక గాయకులు వనమాములై అరుణాదేవీ, సర్వ చిన్నబాపు, బోగె లింగన్న, అయిలి రాజేశ్వరితోపాటు అప్పటి ఎమ్మెల్యే పుట్ట మధుతో కలిసి ఆవిష్కరించారు. యేటా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఇక్కడ నిర్వహిస్తున్నారు. 4నెలల క్రితం టిప్పర్ ఢీకొనడంతో గద్దెతోపాటు శిలాఫలకం, ఘంటసాల విగ్రహం పూర్తిగా ధ్వంసమైంది. దీంతో విగ్రహ నిర్మాణానికి మెండె రమేష్ శ్రీకారం చుట్టారు. దాదాపు 2 నెలల పాటు శ్రమించి విగ్రహాన్ని పూర్తి చేశారు. డివైడర్‌పై గద్దెను నిర్మించి దానిపై సిమెంట్, ఇసుక, రాడుతో నిర్మించాడు. కూర్చొని ఉన్న ఘంటసాల ఆకృతిని జీవ కళ ఉట్టి పడేలా తీర్చిదిద్దారు. రంగులు వేసే కార్యక్రమం పూర్తయితే విగ్రహం మరింత అందంగా కనిపించనుంది. అనేక స్టేజీల పై చిన్ననాటి నుంచి ఘంటసాల పాటలు ఆలపించిన మెండె రమేష్ ఘంటసాల పై ఉన్న అభిమానంతో విగ్రహాన్ని రూపొందించారు.

అంబేద్కర్ విగ్రహాల కూల్చివేతపై ఫిర్యాదు


వినతిపత్రం అందజేసిన అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు

కోల్‌సిటీటౌన్, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో అంబేద్కర్ విగ్రహాల కూల్చివేత, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట విగ్రహాన్ని తొలగించేందుకు అధికారులు చేస్తున్న చర్యలపై జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వాన్, కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్, లవకుశ కుమార్‌కు ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఫిర్యాదు చేశారు. ఆదివారం ఎన్‌టీపీసీకి వచ్చిన చైర్మన్‌ను నాయకులు కలిసి లేఖను అందజేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాల కూల్చివేతకు అధికారులు, పాలకులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అంబేద్కర్ భవన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కుల వివక్షత, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చైర్మన్‌ను కలిసిన వారిలో రిటైర్డ్ ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ బూడిద రాజయ్య, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైన రాజేష్, అంతర్గాం మండల అధ్యక్షుడు ఇండిపెల్లి రవీంద్రకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జనగామ శంకర్ ఉన్నారు.

పశువుల సంరక్షణ యజమానుల బాధ్యత

కరీంనగర్ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న పశువుల సంరక్షణ బాధ్యత యజమానులదేనని, రోడ్లపై వదిలివేయడం చట్టవిరుద్ధమని మున్సిపల్ కార్పొరేషన్ వెటర్నరీ అధికారి డాక్టర్ వై దుర్గాప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నగరంలో శానిటేషన్, పశు సంరక్షణ విభాగం, సహాయ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి సహకారంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్సారార్ కళాశాల, పరిసరాల్లో యథేచ్ఛగా వదిలి వేసిన తొమ్మిది ఆవులను ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. నగరంలో పశు పోషకులు రోడ్లపై వదిలిపెట్టిన పశువుల సంరక్షణ బాధ్యత తీసుకోవాలని, లేకపోతే తెలంగాణ మున్సిపల్ చట్టం-2019, క్రూరత్వ నిరోధక చట్టం-1960 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.